



క్లాక్‌టవర్ వద్ద బ్రిడ్జిపై ట్రాఫిక్‌జామ్

టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

ఎస్మాను ఎత్తేయండి..

చేతకాకుంటే రాజీనామా చేయండి

- అంగన్‌వాడీ, పారిశుధ్య కార్మికుల డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా జైల్ భరో.. నగరంలో భారీ ర్యాలీ



మున్సిపల్ కార్పొరేషన్ నుంచి క్లాక్ టవర్ వరకూ ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, అంగన్‌వాడీలు, కార్మికులు

అనంతపురం విద్య, జనవరి 9: సజ్జల వంటి వారినుంచి సలహాలు తీసుకోవడం మాని, లక్షలాది మంది కార్మికులు, అంగన్‌వాడీల భవిష్యత్తు కోసం వెంటనే ఎస్మాను ఎత్తివేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడం చేతగాకుంటే రాజీనామా చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో సీఎం, వైసీపీ ఎమ్మెల్యేలకు భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ఎస్మాను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జైల్ భరోకు పిలుపునిచ్చారు. వేలాది మంది కార్మికులు అనంతపురం నగరపాలిక కార్యాలయం నుంచి క్లాక్ టవర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. క్లాక్ టవర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి రోడ్డుపై బైఠాయించారు. సీఎం డౌన్ డౌన్, ఎస్మా వెనక్కు తీసుకోవాలి, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి అంటూ నినాదాలు చేశారు. మానవహారంతో ట్రాఫిక్ జామ్ కావడంతో నాయకులను పోలీసులు అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆందోళనకారులు కోర్టు రోడ్డులోని పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. స్టేషన్ వద్ద బైఠాయించడంతో అక్కడ కూడా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్వాడీ యూనియన్ల నాయకులు పోలీస్ స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. వారిని అడ్డుకున్న పోలీసులు ముఖ్య నాయకులను మాత్రమే లోపలికి అనుమతించారు. సుమారు అరగంట తరువాత అరెస్టు చేసినవారిని వదిలిపెట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నాగమణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఏపీ మున్సిపల్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. జైల్ భరోలో భాగంగా గుత్తిలో అంగన్వాడీలు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. గుంతకల్లులో మంత్రులు బొత్స, బుగ్గనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మీరా.. మేమా.. సై..!

ఎస్మాకు బెదరని అంగన్‌వాడీలు

నోటీసులు సిద్ధం చేసిన అధికారులు

అమీతుమీ తేల్చుకునే దిశగా వర్కర్లు

డెడ్‌లైన్ ముగియడంతో సర్వత్రా టెన్షన్



స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు





అనంతపురం విద్య, జనవరి 9: సమ్మె సెగలు.. ప్రభుత్వ హెచ్చరికలతో హీట్ పెరిగింది. ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ ముగిసినా.. అంగన్‌వాడీలు సమ్మె విరమించలేదు. విధుల్లో చేరాలని అధికారులు హెచ్చరించినా ఖాతరు చేయలేదు. సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె కొనసాగుతుందని చెబుతూ.. రోడ్లపై నినదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీలోగా విధుల్లో చేరాలని ప్రభుత్వం గడువు విధించింది. అయినా అంగన్‌వాడీలు స్పందిచని నేపథ్యంలో ఐసీడీఎస్ అధికారులు నోటీసుల జారీకి రంగం సిద్ధం చేశారు. దీంతో అందరిలో టెన్షన్ నెలకొంది. ప్రభుత్వమా... అంగన్‌వాడీలా అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

వేలాది మందికి నోటీసులు

జిల్లా వ్యాప్తంగా 2,032 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,050 మంది వర్కర్లు, 2,042 మంది ఆయాలు పనిచేస్తున్నారు. మరో 220 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరందరూ సుమారు నెల రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ జీవో 2 విడుదల చేసింది. అయినా వర్కర్లు, ఆయాలు బెదరడం లేదు. అధికారులు మాత్రం గత రెండు రోజుల నుంచి సుమారు 80 మంది వరకూ విధుల్లో చేరారని చెబుతున్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలోని 30 కేంద్రాల్లో వర్కర్లు, ఆయాలు, మరో 12 కేంద్రాల్లో వర్కర్లు, నాలుగు కేంద్రాల్లో మినీ అంగన్‌వాడీ వర్కర్, నాలుగు కేంద్రాల్లో హెల్పర్లు సేవలు అందిస్తున్నారని లెక్కలు చూపుతున్నారు. మిగిలిన కేంద్రాలను ఇతర శాఖల అధికారులతో నడుపుతున్నామని ఉత్తుత్తి లెక్కలు చెబుతున్నారు. ఉరవకొండ, రాయదుర్గం ప్రాజెక్టుల పరిధిలో వర్కర్లు, ఆయాలకు ఇప్పటికే నోటీసులు సిద్ధం పోస్టు ద్వారా పంపించారని సమాచారం. ఎన్ని నోటీసులు జారీ చేశారన్న అంశంపై అధికారులు పెదవి విప్పడం లేదు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఈ విషయంపై సమాధానాన్ని దాట వేశారు. .

సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలను బెదిరించేందుకు అధికారులు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. ఈ దిశగా నోటీసులను ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే వర్కర్లు, ఆయాలకు నోటీసులు ఇవ్వడం ప్రారంభించారు. గత నెల

ఏమౌతుందో..

12 నుంచి అంగన్‌వాడీలు సమ్మెలో ఉన్నారు. వారిని ఎలాగైనా దారికి తెచ్చుకోవాలని ప్రభుత్వం బలప్రయోగానికి దిగింది. తాళాలను పగులగొట్టి సెంటర్లను నిర్వహించాలని చూశారు. ఈ ప్రయత్నం విఫలమైంది. దీంతో ప్రభుత్వం మరింత కఠిన చర్యలకు దిగింది. సమ్మె చేయకూడదని ఎస్మాను ప్రయోగించింది. అయినా అంగన్‌వాడీలు తగ్గలేదు. 29వ రోజు మంగళవారం సమ్మె కొనసాగించారు. తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.

ప్రజల నీటి కష్టాలు ఎమ్మెల్యేకు కనపడవా ?

టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి

గుత్తి, జనవరి 9: పట్టణంలో గుక్కెడు నీటి కోసం ప్రజలు పడుతున్న బాధలు ఎమ్మెల్యేకు కనపడవా అని టీడీపీ సీనియర్ నాయకుడు జీవానందరెడ్డి ఎద్దేవా చేశారు. పట్టణంలోని అనంతపురం రోడ్డులోని నిరుపయోగంగా ఉన్న మిడ్ పెన్నార్ నీటి ప్రాజెక్టును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టీడీపీ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి మిడ్ పెన్నార్ ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే ప్రస్తుత పాలకులు దాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో గుత్తిలో తాగునీటిని సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవానంద రెడ్డి

మొసలి కన్నీళ్లకు మోసపోం

ఎమ్మెల్యే పద్మావతిపై దళిత సంఘాల ఫైర్

గార్లదిన్నె, జనవరి 9: శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మొసలి కన్నీళ్లకు మరోసారి మోసపోయేది లేదని దళిత సంఘాలు అన్నాయి. గార్లదిన్నె అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం నాయకులు నాగరాజు, ప్రసాద్, మల్లికార్జున తదితరులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జొన్నలగడ్డ పద్మావతి రాజకీయ అరంగేట్రం చేసినటప్పటి నుంచి ఏనాడూ దళితులను గుర్తించిన పాపన పోలేదని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు ఆరుగురు రెడ్లను కన్వీనర్లుగా నియమించి, దళిత నియోజకవర్గంలో రెడ్లపాలన సాగించారని విమర్శించారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణించారని అన్నారు. నియోజకవర్గంలో దళితులపై దాడులు చేస్తే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నార్పల మండలం బొందలవాడలో దళిత యువతిని ప్రేమపేరుతో మోసం చేసి, హత్య చేసినప్పుడు ఎక్కడున్నారని నిలదీశారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా దళితులు గుర్తుకు రాలేదా అని అన్నారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ రాదన్న కారణంగా మొసలి కన్నీరు కారుస్తున్నారని, దీనికి దళితులు కరిగిపోరని అన్నారు. స్వార్థ ప్రయోజనాలకు, రాజకీయ పబ్బం కోసం దళితులను వాడుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే భర్త ఆలూరు సాంబశివారెడ్డి దళితులను కనీసం మనుషులుగా కూడా పరిగణించలేదని అన్నారు. దళితులపై సాంబశివారెడ్డి అక్రమ కేసులు పెట్టించలేదా అని నిలదీశారు. ఇందుకు ముకుందాపురంలో గడప గడపకు మన ప్రభుత్వంలో దళితుడిపై దాడే నిదర్శనమని అన్నారు. నాడు గుర్తుకు రాని దళితులు నేడు మీ స్వప్రయోజనాలకు గుర్తుకు వచ్చారా అని దుయ్యబట్టారు. దళితులపై దాడులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు పెచ్చుమీరిపోవడానికి పరోక్షంగా మీరు కారణం కాదా అని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో పద్మావతికి దళితులు మద్దతు పలకుండా చూస్తామని ప్రకటించారు.



గార్లదిన్నెలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు



పన్నుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ సేవా కేంద్రం

పన్నుల శాఖ కార్యాలయంలోనే జీఎస్టీ రిజిస్ట్రేషన్

ఆన్‌లైన్ విధానంలో నకిలీ రిజిస్ట్రేషన్లు.. అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం నిర్ణయం

నకిలీలకు చెక్ పడేనా..?

అనంతపురం క్రైం, జనవరి 9: వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ విషయంలో కొత్త విధానాన్ని అవలంబించనున్నారు. ఈ విధానం అమలుతో జీఎస్టీ (వస్తు సేవల పన్ను) చెల్లించకుండా ఎగనామం పెట్టేవారికి ముకుతాడు పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదివరకు ఆన్‌లైన్‌లోనే జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ఈ క్రమంలో నకిలీల రిజిస్ట్రేషన్లు ఎక్కువ జరిగినట్లు నిర్ధారించారు. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఇలాంటివి ఉన్నట్లు సమాచారం. వీటిని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ కౌన్సిల్ కొత్త మార్గాన్ని ప్రవేశపెట్టాయి. తొలుత గుజరాత్, పాండిచ్చేరిలో అమలు చేసి, ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లోకి తెచ్చారు. నెల రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రాంతాల్లోని పన్నుల శాఖ కార్యాలయాల్లో జీఎస్టీ సేవా కేంద్రం పేరుతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రూ.కోట్లలో టర్నోవర్ జరుగుతున్నా నకిలీ వేబిల్లులు ద్వారా, వ్యాపార లావాదేవీలను దాచిపెట్టడం ద్వారా జీఎస్టీ ఎగవేసే వారు చాలామందే ఉన్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ విధానంలోనైనా పన్ను ఎగవేతదారుల ఆటకట్టిస్తే ఆ శాఖ ఆదాయం పెరుగుతుంది.

• ఇతరుల ఆధార్‌తో..

పన్నుల శాఖలో గతంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చినవారు రిజిస్ట్రేషన్లు చేసేవారు. దూరప్రాంతాల వారు తమకు పరిచయం లేని ప్రాంతాల్లో సైతం జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను, పత్రాలను పరిశీలించి.. అవి సరిగా ఉంటే ఆన్‌లైన్‌లోనే జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పంపేవారు. ఈ పద్ధతిని అనువుగా తీసుకుని, చాలా మంది వ్యాపారానికి సంబంధం లేని కూలీలు, పేదల ఆధార్, పాన్ కార్డులతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించేవారు. వారి పేరిట వే బిల్లులు తయారు చేయించి రూ.కోట్లలో టర్నోవర్ చేసేవారు. అసలు విషయం వెలుగులోకి వస్తే ఉడాయించేవారు. చివరికి ఆ రిజిస్ట్రేషన్ వ్యాపారులది కాదని, కూలీలు.. సామాన్యులదని తేలేది. ఇలాంటి వ్యవహారాలు ఎక్కువ సంఖ్యలో తేలడంతోనే కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ కౌన్సిల్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

• ఆఫీస్‌కు రావాల్సిందే...

జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం ఎవరు దరఖాస్తు చేసుకున్నా పన్నుల శాఖ కార్యాలయానికి రావాల్సిందే. ఇదివరకు ఉన్న పూర్తి ఆన్‌లైన్ విధానానికి స్వస్తి పలకనున్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా, తమ కార్యాలయానికి రావాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పన్నుల శాఖ కార్యాలయానికి వెళ్లి ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే డీలర్ ఫొటో సైతం తీసుకుంటారు. దీంతో పాటు బయోమెట్రిక్ తప్పనిసరిగా ఉంటుంది. ఇవన్నీ పూర్తి చేసిన తరువాతే జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.



పన్నుల శాఖ కార్యాలయం



• రూ.40 లక్షల టర్నోవర్ దాటితేనే..

జీఎస్టీ పరిధిలో ఏడాదికి రూ.40 లక్షల టర్నోవర్ దాటితేనే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో జీఎస్టీ నమోదు చేసుకున్న డీలర్లు(వ్యాపారులు) 30 వేల వరకు వరకు ఉంటారని అంచనా. రెండున్నరేళ్ల క్రితం వరకు పరిమితి రూ.20లక్షల వరకే ఉండేది. ప్రస్తుతం ఆ పరిమితి పెరిగింది. వ్యాపార లావాదేవీల నిమిత్తం కొందరు రూ.10లక్షల టర్నోవర్ ఉన్నా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఏటా రూ1.50 కోట్ల లోపు టర్నోవర్ చేస్తూ, కేవలం రాష్ట్ర పరిధిలోనే అమ్మకాలు చేసే వారిని కంపోజిషన్ డీలర్లు అంటారు. వీరు స్టేట్ జీఎస్టీ ఒక శాతం, సెంట్రల్ జీఎస్టీ ఒక శాతం కలిపి రెండు శాతం మాత్రమే పన్ను చెల్లిస్తారు. ఇక డీలర్లందరూ తమ తమ వ్యాపారాల ఆధారంగా పన్నును 5, 12, 18, 28 శ్లాబులుగా చెల్లిస్తుంటారు.



చికెన్ సెంటర్ వద్ద పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వారే చేశారా..?

టీడీపీ కార్యకర్త చికెన్ సెంటర్‌లో చోరీ

వైసీపీ వర్గీయులను టీడీపీలో చేర్పించడంలో కీలకంగా వ్యవహరించిన పార్టీ కార్యకర్త శ్రీధర్ చికెన్ సెంటర్‌లో చోరీ జరిగింది. కొన్నాళ్ల క్రితం చికెన్ సెంటర్‌ను ఖాళీ చేయాలని వైసీపీ వర్గీయులు శ్రీధర్‌ను బెదిరించిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో చెన్నేకొత్తపల్లిలోని శ్రీధర్ చికెన్ సెంటర్‌లో సుమారు రూ.40 వేల విలువైన వస్తు సామగ్రి మాయమైంది. దుకాణాన్ని తెరిచేందుకు మంగళవారం తెల్లవారు జామున వెళ్లిన శ్రీధర్.. చోరీ జరిగినట్లు గుర్తించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ చోరీ వెనుక అధికార పార్టీవారి హస్తం ఉందని వారు ఆరోపించారు. డిసెంబరు 27న చెన్నేకొత్తపల్లికి చెందిన పలువురు వైసీపీ నాయకులు మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరారని, శ్రీధర్ ప్రోద్బలంతోనే ఈ చేరికలు జరిగాయని వైసీపీ వారు కక్ష కట్టారని అన్నారు. పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని చోరీ కేసును నిగ్గు తేల్చాలని కోరారు. **- చెన్నేకొత్తపల్లి**

తాగునీటి వరద



పైప్‌లైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న శ్రీరామిరెడ్డి నీరు

ఇది ముంగారులో కురిసిన చినుకు లకు వంకలో పారుతున్న నీరు కాదు. 35 గ్రామాల ప్రజల గొంతు తడిపే నీటి పైపు లైను పగిలి వృథాగా ప్రవహిస్తున్న నీరు. శెట్టూరు మండలంలోని చెర్లోపల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శ్రీరామి రెడ్డి ప్రధాన పైప్‌లైన్ మంగళవారం పగిలిపోయింది. శ్రీరామిరెడ్డి కార్మికులు సమ్మెలో ఉండటంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నీరంతా పారి ఆగిపోయింది. **- కళ్యాణదుర్గం**

ఖాళీ కుర్చీల సభ

వైసీపీ సాధికార యాత్రకు స్పందన కరువు

- ఫ్లెక్సీలు చించుకుని బయటికెళ్లిన మహిళలు
- గుంతకల్లులో ఉదయం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు
- సమ్మె సెగ తగలకుండా పోలీసు బందోబస్తు

గుంతకల్లు, జనవరి 9: వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం కరువయ్యారు. మంత్రులు ఎవరూ రాకపోవడంతో ఇద్దరు ఎంపీలు, పార్టీ జిల్లా అధ్యక్షుడే పెద్దదిక్కయ్యారు. యాత్ర సందర్భంగా పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ ఎంపీ నందిగామ సురేష్ మాట్లాడారు. జగన్ కాంగ్రెస్‌ను వీడిన తర్వాత ఆ పార్టీ తమకు ప్రత్యర్థి పార్టీ అని, అందులో చేరిన షర్మిల కూడా తమకు ప్రత్యర్థేనని అన్నారు. అనంతరం పాత గుంతకల్లులోని బీరప్ప ఆలయ సర్కిల్ వద్ద నుంచి బస్సు యాత్రను ప్రారంభించారు. బహిరంగ సభ షెడ్యూలు మధ్యాహ్నం 3 గంటలకు అని చెప్పినా, రెండున్నర గంటల ఆలస్యంగా ప్రారంభించారు. సభ కోసం పొదుపు మహిళలను బలవంతంగా రప్పించినా.. సభ మొదలయ్యే సమయానికి ఖాళీ కుర్చీలు కనిపించాయి. ఉన్న కొందరినీ వెళ్లనివ్వకుండా మునిసిపల్ మెప్మా సిబ్బంది సభ చివరలో అడ్డుగా నిలబడ్డారు. దీంతో మహిళలు అడ్డుగా ఉంచిన ఫెక్సీలను చించేసి అందులో నుంచి దూరి వెళ్లిపోయారు. సభలో మాట్లాడిన వక్తలు ఆకట్టుకోలేకపోయారు. జగన్ 99 శాతం హామీలను నెరవేర్చారని, టీడీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చిన ఆలీ ప్రసంగం కూడా చప్పగా సాగింది. ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి చూసేందుకు సినిమా విలన్‌లా కనిపిస్తున్నా, మనిషి మంచోడని అన్నారు. ఈసారి ఆయను లక్ష మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. 175 స్థానాల్లో వైసీపీ గెలుపు తథ్యమని చెప్పి ముగించారు. ఆలీ మాట్లాడే సమయానికి సభలో జనం సగం ఖాళీ అయ్యారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడే సమయానికి ముప్పావు వంతు జనం అక్కడి నుంచి జారుకున్నారు.



ఎంపీ రంగయ్య మాట్లాడే సమయానికి ఖాళీ అయిన కుర్చీలు

సెగ తగలకుండా..

సామాజిక సాధికార బస్సు యాత్రకు నిరసనకారుల సెగ తగలకుండా మెయిన్ రోడ్డులో కట్టుదిట్టమైన పోలీసు పహారాను ఏర్పాటుచేశారు. సభ కోసం ఉదయం 11 గంటల నుంచే మెయిన్ రోడ్డును పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. వాహనాలను ప్రత్యామ్నాయ దారుల్లో మళ్లించారు. దీంతో వాహనదారులు సాయంత్రం ఏడుగంటల వరకూ ఇక్కట్లుపడ్డారు. బస్సు యాత్ర మార్గంలో అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్ల నిరాహార దీక్షా శిబిరాలు ఉండటంతో ఎటువంటి ఆటంకాలు కలిగించరాదని పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేశారు. పోలీసు పహారా నడుమ వైసీపీ నాయకుల బస్సు సభా స్థలం వద్దకు చేరింది.



ఫ్లెక్సీ రంధ్రం నుంచి వెళ్లిపోతున్న జనం.. ఖాళీగా ఉన్న కుర్చీలు



సాష్టాంగ నమస్కారం చేస్తూ శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన

ఆగని శ్రీరామిరెడ్డి కార్మికుల ఆందోళన

● 325 గ్రామాలకు నిలిచిపోయిన తాగునీటి సరఫరా

కళ్యాణదుర్గం, జనవరి 9 : తమ డిమాండ్లు నెరవేర్చాలని శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన ఆందోళనలు 9వ రోజుకు చేరాయి. కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. మంగళవారం పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, సాష్టాంగ నమస్కారం చేస్తూ వినూత్న రీతిలో నిరసన చేపడుతూ, ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. పేస్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో పలు గ్రామాల్లో దాహార్తి నెలకొంది. 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. 5 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను విరమించేది లేదని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అనంతపురం కల్చరల్, జనవరి 9 : ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో ఆధ్వర్యంలో బుధవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతపురం డీఎం నాగభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవడంతో పాటు, ఏవైనా ఫిర్యాదులుంటే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తెలియజేయవచ్చన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 08554 248553 లేదా 99592 25853 నెంబర్‌ను సంప్రదించి మాట్లాడవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


అనంతపురం టౌన్ జనవరి9 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 104లో డ్రైవర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మేనేజరు క్రిష్ణమూర్తి మంగళవారం ప్రకటించారు. డ్రైవర్ పోస్టులకు డ్రైవర్ హెవీ లైసెన్స్, టెన్త్‌పాస్, ఐదుసంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఏదైనా డిగ్రీ. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు దరఖాస్తులను జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న 104 ఆఫీస్‌లో అందజేయాలని సూచించారు. వివరాలకు 91770 02479 నంబరును సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

చేతులెత్తేసిన జగన్!



జేఎన్‌టీయూ కళాశాల

● ఇప్పటికీ విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్
● ప్రారంభమైన మొదటి సెమిస్టర్ పరీక్షలు... హాల్ టికెట్లు ఇవ్వని యాజమాన్యాలు
● సీఎం జగన్‌పై మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



అనంతపురం సెంట్రల్, జనవరి 9: ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు కళాశాల ట్యూషన్ ఫీజును రీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఫీజును స్కాలర్‌షిప్ రూపంలో గత ప్రభుత్వాలు చెల్లిస్తూవచ్చాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు వారిపిల్లల చదువులకు ఫీజుల బెంగ లేకుండా ఉండేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగన్ విద్యా దీవెనగా, స్కాలర్‌షిప్‌ను జగన్ వసతి దీవెనగా పేర్లు మార్చారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమచేసి వారిలో బాధ్యత పెంచుతామని, ఏడాది ఫీజును నాలుగు విడుతలుగా చెల్లిస్తామని గొప్పలు చెప్పారు. ఈ మేరకు సకాలంలో చెల్లించకుండా మధ్యమధ్యలో కొన్ని విడతలను ఎత్తివేశారు. అయితే 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశాలు పొంది నెలలు గడుస్తున్నా నేటికీ విద్యా దీవెన, వసతి దీవెన మొత్తాలను చెల్లించకుండా సీఎం చేతులెత్తేశాడు. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్స్ ఇస్తామని, మెస్‌బిల్స్ కడితేనే పరీక్షలు రాయిస్తామని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హుకుం జారీ చేస్తున్నాయి. కొద్దిరోజుల్లో జగన్‌కు సీఎం పదవీ కాలం ముగుస్తుండటంతో వచ్చే ప్రభుత్వ మే మీకు ఫీజులు చెల్లిస్తుంది. ఇక నేనివ్వలేనని చేతులెత్తాశాడంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటువచ్చింది. మా పిల్లలకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని అనుకుంటే.. ప్రభుత్వంతో మాకు సంబంధంలేదని ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని కళాశాలల యాజమాన్యాలు ముక్కుపిండి వసూలు చేయడం జగన్ చేతకాని తనానికి నిదర్శనం కాదా అని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలాగే వచ్చే ప్రభుత్వం ఫీజులభారాన్ని తప్పిస్తుందని పేర్కొంటున్నారు.



జేఎన్‌టీయూ, ఎస్కేయూ పరిధిలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల సంఖ్య

కోర్సులు	విద్యార్థులు
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	1818
ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్	7199
మెకానికల్ ఇంజనీరింగ్	804
సివిల్ ఇంజనీరింగ్	974
కంప్యూటర్ ఇంజనీరింగ్	18913
బీ ఫార్మసీ	2930
ఫార్మాడి	619
బీఏ	1692
బీకామ్	8889
బీఎస్సీ	7630
బీబీఏ	1895
బీసీఏ	249
లా కోర్సులు	700
మొత్తం	54312

54,312 మంది విద్యార్థులు...

జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో 184 ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలున్నాయి. అదేవిధంగా ఎస్కేయూ ఆధ్వర్యంలో 87 డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో అధికారిక లెక్కల మేరకు 54312మంది విద్యార్థులు కన్వీనర్ కోటా కింద డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ విద్యా దీవెన, వసతి దీవెన సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలి. ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కావడంతో ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను డిమాండ్ చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వం చెల్లించకుంటే సీఎం జగన్‌ను ప్రశ్నించాల్సిన యాజమాన్యాలు పరీక్షల నిర్వహణ పేరుతో విద్యార్థులపై ప్రతాపం చూపుతున్నాయని, ఇలాంటి పరిస్థితులకు కారణం సీఎం జగన్ మాత్రమేనని పేర్కొంటున్నాయి.

ఆవేదన చెందవద్దు...



రానున్న కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి ఫీజులు చెల్లించే బాధ్యత తీసుకుంటుంది. విద్యార్థులెవరూ ఆవేదన చెందవద్దు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజుల ఆలోచన లేకుండా నేరుగా కళాశాలకే చెల్లించేది. దీంతో హాల్‌టికెట్స్, పరీక్షల అంశాల్లో సమస్యల్లేకుండా చదువుపైనే దృష్టిసారించేవారు.

-పరశురాం, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చేతగాని సీఎంగా జగన్...



విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లించకుండా వారిని మానసికంగా కుంగదీస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి చేతగాని సీఎంగా నిలిచిపోయాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనగా తనపేరు పెట్టుకున్నా.. నిధులు ఇవ్వకుండా నాలుగేళ్లుగా విద్యార్థులను వేధిస్తున్నాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులే కాయ, కష్టంచేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

-వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రథమ సెమిస్టర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇక రానట్లేనా...?

కొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. అంతకుముందే ఎన్నికల కోడ్‌వస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం జగన్.. తన మంది మార్బలాన్ని సమకూర్చుకోవడం, మార్పులు, చేర్పులు చేపట్టడం తదితర ఎన్నికల ప్రక్రియలో మునిగిపోయి ఫీజుల చెల్లింపు అంశాన్ని విస్మరించాడు. విద్యా దీవెన, వసతి దీవెన మొత్తాలు ఇక రానట్లేనని స్పష్టమౌతోంది. దీంతో తమ పిల్లల చదువు మధ్యలో ఆగిపోకూడదని కాయ, కష్టంచేసి తామే సొంతంగా ఫీజులు చెల్లిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. మేనమామగా మీ పిల్లలను నేను చదివిస్తానని ఎన్నికల్లో చెబితే సంబరపడిపోయామని. వాస్తవ రూపంలో పరీక్షలు కూడా రాయనీయకుండా వేధిస్తున్నాడని వాపోతున్నారు.

వైసీపీ ప్రభుత్వం సిగ్గుపడాలి...



ఫీజుల రూపంలో విద్యార్థులను వేధిస్తున్న వైసీపీ ప్రభుత్వం సిగ్గుపడాలి. కన్వీనర్ కోటాలో ప్రవేశంపొందిన విద్యార్థుల పూర్తిస్థాయి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో విద్యార్థులకు సంబంధం లేకుండా కళాశాలలకే నేరుగా ప్రభుత్వం ఫీజులు చెల్లించేది. జగన్ మాత్రం సొంతంగా ఫీజులు ఇస్తున్నట్లు తన పేరుగా పెట్టుకుని బటన్ నొక్కే కార్యక్రమాన్ని చేస్తున్నాడు. అయినా అనేక విడతలను ఎగరగొట్టి విద్యార్థులతోనే ఫీజులు కట్టించాడు.

-కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ముస్లింల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

ముస్లిం రిజర్వేషన్లకు చట్టబద్ధత తెస్తాం

● శాసనమండలి మాజీ అధ్యక్షుడు షరీఫ్ హామీ
● టీడీపీతోనే మైనార్టీలకు న్యాయం : మాజీ మంత్రి కాలవ
● రాయదుర్గంలో ముస్లింల ఆత్మీయ సదస్సు

రాయదుర్గం, జనవరి 9: ముస్లిం మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి తెలుగుదేశం పార్టీ ప్రయత్నం చేస్తోందని శాసన మండలి మాజీ అధ్యక్షుడు షరీఫ్ పేర్కొన్నారు. పట్టణంలోని షాదీమహల్‌లో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సును మంగళవారం నిర్వ హించారు. అంతకుముందు శాంతి నగర్‌లో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడ నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీగా షాదీమహల్‌కు చేరుకున్నాయి. సదస్సుకు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అధ్యక్షత వ హించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లకు ఇప్పటికీ చట్టబద్ధత లేదన్నారు. హైకోర్టులో మూడు సార్లు కొట్టేశారని తెలిపారు. ఈ నాలుగు శాతాన్ని ముస్లింలకు అందించాలని తెలుగుదేశం పార్టీ సుప్రీంకోర్టులో పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 10 శాతం మంది ముస్లింలు ఏకతాటిపై వచ్చి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో 160 స్థానాల్లో టీడీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెల్లకార్డు ఉంటే చాలు దుల్హన్ పథకం కింద రూ.లక్ష ఇస్తామన్నారు. సీఎం జగన్ తన మీద ఉన్న కేసుల నుంచి బయట పడడానికి బీజేపీకి దాసోహమయ్యాడన్నారు. సీబీఐ కేసుల్లో వాయిదాలకు హాజరు కాకపోయినా బెయిల్ రద్దు కాలేదంటే దీని వెనుక బీజేపీతో ఉన్న బలమైన బంధమే కారణమన్నారు. తన బెయిల్ కోసం జైలు జీవితం లేకుండా ఉండడాన్ని కోసం చిన్నాన్నను చంపిన వాళ్లను కాపాడుకోవడం కోసం తొత్తుగా మారాడని ఘాటుగా విమర్శించారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ మైనార్టీల కోసం టీడీపీ 27 పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని, షాదీమహల్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించలేదన్నారు. దుకాణ్, మకాన్ లాంటి స్కీంలను పెట్టలేదన్నారు. చంద్రబాబు చల్లని పాలన కోసం ప్రతి మైనార్టీ కృ షి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, గ్రంథాలయ మాజీ చైర్మన్ గౌస్, నియోజకవర్గ పరిశీలకురాలు పర్వీన్‌తాజ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సాలార్‌బాషా, రిటైర్డ్ ఎస్పీ షేక్షావలి, మైనార్టీ నాయకులు కడ్డిపూడి మహ బూబ్‌బాషా, ఇనాయత్, ఉస్మాన్, జిలాన్, సనావుల్లా, జమీల్‌ఖాన్ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మైనార్టీ నాయకులు

వ్యాపారి చేతిలో మోసపోయిన రైతులు

● న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు

బెళుగుప్ప, జనవరి 9 : వ్యాపారి చేతిలో మోసపోయిన రైతులు న్యాయం చేయాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ కళ్యాణదుర్గానికి చెందిన వ్యాపారి హసిన్‌కు తమ మొక్కజొన్న పంటను విక్రయించగా, నగదు చెల్లించకుండా పరారీలో ఉన్నాడని వాపోయారు. మండలంలోని రమణేపల్లి, కాల్వపల్లి, యలగలవంక, విరుపాపల్లి తదితర గ్రామాల రైతులు వ్యాపారి చేతిలో మోసపోయారు. యలగలవంకకు చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డి రూ. 3.80 లక్షలు, శివశంకర్‌కు రూ. 15 వేలు, గోవిందుకు రూ.1.40 లక్షలు, రాఘవేంద్రకు రూ. 3.60 లక్షలు, మధుకు రూ. లక్ష వ్యాపారి నుంచి రావాల్సి వుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రమణేపల్లిలో ఎక్కువ మంది రైతులు మోసపోయినట్లు తెలిపారు. వ్యాపారులపై నమ్మకమే రైతులను నట్టేట ముంచుతోందని, వ్యాపారి కళ్యాణదుర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అక్కడే సీఐ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురంరూరల్,జనవరి9: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 11వతేదిన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనందరాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్, బ్లూస్టార్, కేఐఎంఎల్, శ్రీజా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీలు జాబ్‌మేళాలలో పాల్గొంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనంతపురం, బెంగుళూరు, హైదరాబాద్, హిందుపురం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.10వేల నుంచి రూ. 20వేల వేతనం అందిస్తారన్నారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఆధార్, విద్యార్హతల పత్రాలతో హాజరవ్వాలన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 8317520929 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మూన్నెళ్లలో సైకో పాలన అంతం

● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి
● టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



అనంతపురం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మరో మూడు నెలల్లో సైకో పాలనకు ప్రజలు అంతం పలకనున్నారని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. సీఎం జగన్ నేతృత్వంలోని నాలుగున్నరేళ్ల కుప్పైబడిన రాక్షస పాలనలో అన్నివర్గాల ప్రజలు బాధితులేనని ఆయన ఆరోపించారు. మంగళవారం అనంతపురంలోని తన నివాసంలో పరిటాల శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి అన్నివర్గాల ప్రజలు జగన్ బాధితులుగా మారారని, చివరికి అంగన్‌వాడీల సమ్మెతో చిన్న పిల్లలు సైతం బాధితుల జాబితాలోకి చేరారన్నారు. ఎన్నికలకు ముందు అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలిచ్చారని, ఏరు దాటాకా తెప్ప తగలేసిన చందంగా అధికారంలోకి రాగానే... ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. మాట తప్పను.. మడమ తిప్పను అనే జగన్ సీఎం అయ్యాక అన్నీ తప్పిన నేతగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ విధ్వంస పాలన రాజధాని అమరావతిని నాశనం చేసేంతవరకూ కొనసాగిందని, రాష్ట్రం అన్ని విధాలుగా బాగుండాలంటే చంద్ర బాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందన్నారు. సైకో పాలనపై విసిగివేజారిపోయిన ప్రజలు చంద్రబాబు చేపట్టిన రా... కదలిరా బహిరంగ సభలకు అశేషంగా వస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ తీసుకొచ్చిన మినీ మేనిఫెస్టోలోని పథకాలపై ప్రజలు హర్షితిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీల హత్యల పరంపర కొనసాగిందని, ఆ వర్గాలకు చెందిన వేలాది మందిపై అక్రమంగా కేసులు నమోదు చేయించి బీసీల అణిచివేతకు జగన్ ప్రభుత్వం పాల్పడిందని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే... ప్రత్యేకంగా బీసీల రక్షణ కోసం ఒక చట్టాన్ని తీసుకు రాబోతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన చరిత్ర సైకో ముఖ్యమంత్రిదన్నారు. జగన్ పాలనలో రైతాంగం తీవ్ర అన్యాయానికి గురైందన్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకునే దిక్కులేకుండా పోయిందన్నారు. ఎన్నికల ముందు ధరల స్థిరీకరణ నిధులంటూ గొప్పలుపోయిన ముఖ్యమంత్రి బాధిత రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమయ్యా రని విమర్శించారు. ప్రాజెక్టుల విషయంలోనూ జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించ డంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చంద్ర బాబు పాలన కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు.

ఎన్నికల కమిషన్ సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

అనంతపురం టౌన్, జనవరి 9: కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన సమీక్షల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. ఎన్నికల కమిషనర్లు అనూష్ చంద్రపాండే, అరుణ్‌గోయల్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో కలెక్టరు గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌లు పాల్గొన్నారు. జిల్లాలో ఓటర్లఫిర్యాదులు, వాటిపరిష్కారం, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఎన్నికల ఏర్పాట్లు గురించి కలెక్టరు ఎన్నికల కమిషన్‌కు వివరించారు. జిల్లాలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, చెక్‌పోస్టుల అంశాలను ఎస్పీ తెలియజేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 9: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలల బీటెక్ ఫలితాలను మంగళవారం ప్రిన్సిపాల్ సత్యనారాయణ తనకార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ తృతీయ, నాల్గవ సంవత్సరం విద్యార్థులకు డిసెంబరులో ప్రథమ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించామని, విద్యార్థులు ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్లు భానుమూర్తి, బాల నరసయ్య, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విష్ణువర్ధన్, లలిత, విభాగాధిపతులు భారతి, కళ్యాణిరాధ, మారాల రామశేఖరడ్డి, శైలకుమారి పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాల సమ్మేళనం తెలుగుభాష

● అనంత తెలుగు భాషా వైభవ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

అనంతపురం సెంట్రల్, జనవరి 9: తెలుగుభాష ఎంతో గొప్పదని, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూ ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో మంగళవారం అనంత తెలుగు భాషా వైభవ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అభ్యదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు, తెలుగు సాహితీమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 11వ శాతాబ్దంలో తెనుంగు, తెనుగు, తెలుగు భాష స్వరూపం మార్చుకుంటూ తెలుగు పదంగా నామకరణం చేయబడిందన్నారు. నన్నయ, యర్రన, తిక్కన, పోతన, పాల్కూరి సోమన భారతం, రామాయణం వంటి ఇతిహాసాల ద్వారా తెలుగుభాషకు పట్టం కట్టారన్నారు. పోతులూరి వీరబ్రహ్మన్న, వేమన, గురజాడ అప్పారావు, గుర్రం జాషువా, గిడుగు రామ్మూర్తి తదితర ఆధునిక కవులు తెలుగుని ప్రజల భాషగా మార్చారన్నారు. తదనంతరం సాహిత్యం, మార్క్సిజం, సోషలిజం, ఫ్యూడలిజం, మహారాష్ట్ర దళిత సాహిత్యం, తదితర ఉద్యమాల ద్వారా తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విభజన జరిగిందన్నారు. ఈ క్రమంలో భావ, అభ్యుదయ, విప్లవ, స్త్రీ, దళిత, మైనార్టీ, బహుజన తదితర వాదాలుగా విస్తరించి సాంఘిక, అసమానత, వర్గ వివక్షతలను సాహిత్యరూపంలో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించింది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనంగా తెలుగు భాష విరాజిల్లుతోందన్నారు. నవలా, కథా, జానపద సాహిత్యం. కవిత్వం, హాస్యం వివిధ ప్రక్రియలపైన రచనలు చేసిన రచయితలు, కవుల సేలను గుర్తించేలా సదస్సును ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. అనంతరం జీవిత సాఫల్య, ప్రతిభా పురస్కార అవార్డులతో సత్కరించారు. తెలుగు పండిట్ డాక్టర్ శివన్న, తెలుగు ప్రొఫెసర్ నరసింహన్, పరిశోధక విద్యార్థి నల్లబోతుల అరుణ్‌కుమార్, రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, నాగేశ్వరచారి, మధన్‌మోహన్, ఏఈపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్‌పర్సన్ శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, డీవీఈఓ వెంకటరమణ నాయక్, జడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయ ర్లు కొగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తెలుగు భాషా సేవ ప్రతిభా పురస్కార గ్రహీతలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న సాహితీ వేత్త దామోదర్ రెడ్డి



పోలేపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

చంద్రబాబుతోనే అభివృద్ధి

రామగిరి, జనవరి 9: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, మళ్లీ అతన్ని ముఖ్యమంత్రి చేయడానికి అందరూ కృషి చేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలు సర్వనాశనమయ్యాయని, దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమాలు అధికమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చంద్రప్ప, శ్రీరాములు, పరంధామ యాదవ్, పాపిరెడ్డిపల్లి రమేశ్, ప్రభాకర్, తిమ్మానాయుడు, శ్రీనివాసులు, అశోక్, కిష్టప్ప, గోపాల్, నారాయణ పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

అనంతపురం అర్బన్, జనవరి 9: ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల బలోపేతం కోసం సభ్యులు సమష్టిగా కృషి చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో ప్రాథమిక సంఘాల సభ్యులకు సహకారం ద్వారా సమృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సహకార సంఘాలు లాభాల బాటలో నడిచేందుకు ప్రణాళికలు రూపొందించుకొని.. ఆ దిశగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడు నరసింహ గౌడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్ గోల్డ్‌స్మన్ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో పంచాయతీలు నిర్వీర్యం: జనసేన



సమస్యలపై ఆరా తీస్తున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 9: వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌రెడ్డి పంచాయతీలను నిర్వీర్యం చేశాడని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా ఆమె నాల్గో రోజైన మంగళవారం స్థానిక రాజీవ్‌కాలనీలో పర్యటించారు. సీఎం జగన్ రెడ్డి ఒంటెద్దు పోకడలతో పంచాయతీ వ్యవస్థలను నాశనం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలకు నిధులు కేటాయించకుండా పంచాయతీల్లో మౌలిక వసతుల కొరతకు కారణమయ్యాడన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తాం : ఏఐటీయూసీ



మానవహారంగా ఏర్పడిన ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం క్రైం, జనవరి 9: మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించుకోకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పాతూరులోని గాంధీ సర్కిల్‌లో కార్మికులు మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ... కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కృష్ణుడు, నాగరాజు, శివకృష్ణ, నాగేంద్రబాబు, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా లోకేష్

అనంతపురం కల్చరల్, జనవరి 9: ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరువీధుల లోకేష్ నియమితుడయ్యాడు. మంగళవారం సాయంత్రం స్థానిక వైశ్య హాస్టల్ ఆవరణంలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో అతన్ని నియమించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, పోతుల మనోజ్, తిరువీధుల జగదీష్ అతనికి నియామకపత్రం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కలవల సతీష్, కర్ణాటకమ్ సత్య, శబరి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దారుణం: ఆర్ఈఎఫ్

అనంతపురం అర్బన్, జనవరి 9: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై ఎస్మా ప్రయోగించడం అత్యంత దారుణమని ఆర్ఈఎఫ్ రాయలసీమ అధ్యక్షుడు ఎండీ నాగభూషణబాబ్జీ ఒక ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగులపై కక్షసాధింపు ధోరణితో ముందుకు వెళుతోందని, వైసీపీ పతనానికి రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయకపోతే వారికి మద్దతుగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నవభారత్‌లో సంక్రాంతి సంబరాలు

అనంతపురం కల్చరల్, జనవరి 9 : స్థానిక ఆజాద్‌నగర్‌లోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు విశేషంగా అలరించాయి. పాఠశాల ఆవరణంలో భోగిమంటలు వేసి, మంటల చుట్టూ విద్యార్థులు నృత్యం చేశారు. అనంతరం దాదాపు 60 మంది చిన్నారులు రకరకాల రంగవల్లులతో పాఠశాల ఆవరణాన్ని వర్ణశోభితం చేశారు. చిన్నారులు ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నిట్టూరు గురుప్రసాద్, కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, అనిత, అధ్యాపకబృందం పాల్గొన్నారు.



భోగిమంటల చుట్టూ నృత్యం చేస్తున్న చిన్నారులు

వైసీపీ ఓటమి ఖాయం

మాజీ మంత్రి పరిటాల సునీత





బండమీదపల్లిలో టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి పరిటాల సునీత, హాజరైన ప్రజలు

రాప్తాడు, జనవరి 9: వైసీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలూ విరక్తి చెందారని, ఆ పార్టీ నాయకులే విసుగు చెందారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం తప్పదని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. మండలంలోని బండమీదపల్లిలో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపామన్నారు. బండమీదపల్లి రైతుల కోరిక మేరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ. 8 కోట్లు ఖర్చు చేసి చెరువుకు నీరిచ్చి మరువ పారించామన్నారు. వసతి గృహం, అంగన్వాడీలు భవనాలు, సీసీ రోడ్లు, సామాజిక భవనాలు. ఇంటింటికీ మంచినీటి కొళాయి, మరుగుదొడ్లు నిర్మించామన్నారు. రూ. కోట్లు ఖర్చు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అభివృద్ధి గాలికి వదిలేశారన్నారు. ఎమ్మెల్యే, అతని సోదరులు భూ దందాలు, అవినీతి, కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు అభివృద్ధి చెందారు కానీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు అన్యాయమైపోయారన్నారు. గొందిరెడ్డిపల్లి గుట్టలో ఎర్రమట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. పాల డెయిరీ పేరుతో మహిళల నుంచి రూ 10 కోట్లు వసూలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. పేదల భూములు దోచుకుని కోట్లకు పడగలెత్తారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అయినా బండమీదపల్లి చెరవు నింపలేకపోయారన్నారు. ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి ..: బండమీదపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 25 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రాప్తాడు, ఆత్మకూరు మండలాల ఇన్‌చార్జ్‌లు ధర్మవరపు మురళి, బాలాజీ, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యం

ఆత్మకూరు : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేంతవరకూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. సోషల్ మీడియా విభాగంలో మంచి ప్రతిభ చూపిన మండలంలోని టీడీపీ నాయకులను అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె అభినందించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, రూరల్ కన్వీనర్ సూరి, మాజీ కన్వీనర్లు క్రిష్ణమోహన్ చౌదరి, వెంకట నారాయణ, సోషల్ మీడియా కో-ఆర్డి నేటర్లు బాలు, ఉజ్జనప్ప, నాయుడు, నారాయణ స్వామి, ఉపేంద్ర, ధనుంజయ పాల్గొన్నారు.



అనంతపురంలో సోషల్ మీడియా ప్రతినిధులను అభినందిస్తున్న పరిటాల సునీత

ఫైనల్లో బాల్ బ్యాడ్మింటన్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 9: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మంగళవారం జరిగిన 69వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమిళనాడు జట్టుపై విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్ జట్టు ఫైనల్‌కు చేరింది. బుధవారం నిర్వహించే ఫైనల్ పోరులో ఇండియన్ రైల్వేస్ జట్టుతో తలపడనుందని ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, వెంకట్రావు, జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు.

ఫైనల్‌కు చేరిన బాల్ బ్యాడ్మింటన్ జట్టు →



మాదిగల ఆత్మీయ కలయిక

అనంతపురం సెంట్రల్, జనవరి 9: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మాదిగల ఆత్మీయ కలయికను మంగళవారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని, సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేట్ తదితర స్థానాల్లో పోటీచేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో రిజర్వేషన్ శాసనసభ స్థానాలను రెట్టింపు చేయాలని, జనరల్ కోటాలోనూ పోటీచేసే అవకాశమివ్వాలని అన్నారు. హక్కులను సాధించుకునేందుకు తగిన ప్రణాళికల రూపకల్పనకు ఈ నెల 31న మాదిగ సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీసీఆర్ దాసు, కేపీ నారాయణస్వామి, గంగాధర, బంగి మల్లేష్, యల్లన్న, స్మార్ట్ మధు, టీకేఎస్ ఆనంద్, బంగి నాగ, కదిరిప్ప, చెన్నకేశవులు, బీజేపీ శివశంకర్, దాసగాని కుళ్లాయప్ప, బాలపెద్దన్న, ఉద్యోగ సంఘాల నాయకులు రాజారమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

47 మందికి కొవిడ్ పరీక్షలు

అనంతపురం టౌన్ జనవరి 9: అనుమానపు లక్షణాలు ఉన్న 47 మంది మంగళవారం కొవిడ్ పరీక్షలు నిర్వహించామని, అందరికీ నెగిటివ్ వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వాతావరణ మార్పులతో అనేక మంది జలుబు, జ్వరాలు, దగ్గు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

'జైభారత్' జాతీయ గౌరవాధ్యక్షురాలిగా నాగమణి



అనంతపురం కల్చరల్, జనవరి 9: జైభారత్ సమాచార హక్కు సంఘం మహిళా విభాగం జాతీయ గౌరవాధ్యక్షురాలిగా అనంతపురం జిల్లాకు చెందిన నాగమణి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న నాగమణికి జాతీయ మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు బీహెచ్ సుమిత్రా నందన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు వాలీబాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 9: రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-19 బాలుర ఎంపిక పోటీలను గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ నరసింహారెడ్డి తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రాలు, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 94418 18491ను సంప్రదించాలన్నారు.

చంద్రబాబును కలిసిన గాజుల ఆదెన్న

అనంతపురం అర్బన్, జనవరి 9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న కలిశా రు. మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రా కదలిరా కార్యక్రమానికి హాజ రైన చంద్రబాబును ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఉషారాణి

గార్లదిన్నె, జనవరి 9: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలనే దానిపై తహసీల్దార్ ఉషారాణి ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, వ్యవసాయ అధికారి సోమశేఖర్, వీఆర్‌ఓలు గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, మనుబాబు, పంచాయితీ కార్యదర్శి రవిచంద్రా, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన అన్నదానం



మాలధారులకు భిక్షను వడ్డిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్ : దీక్షామండల కాలాన్ని పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయంలో గత నెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్న దీక్షదారుల అన్నదాన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం దాదాపు 300 మంది వివిధ దేవతా మాలధారులకు భిక్ష అందజే శారు. సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ మాట్లాడుతూ... డిసెంబరు 1 నుంచి మంగళవారం వరకు దాదాపు 15 వేల మందికి దాతల సహకారంతో భిక్షను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు రవీంద్ర, సాయిట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, ప్రదీప్, మోహన్ పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

గార్లదిన్నె, జనవరి 9: మండలంలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనకచెర్ల గ్రామానికి చెందిన ముత్యాలుకు మారెప్ప స్థల విషయం చిన్నపాటి గొడవచోటు చేసుకుంది. దీంతో సోమవారం రాత్రి ముత్యాలు ఇంటిపైకి మారెప్ప, రాజశేఖర్, రవితేజ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ముత్యాలు గాయపడ్డాడు. అతని ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శింగనమల చెరువుకు పొంచి ఉన్న ముప్పు

శింగనమల, జనవరి 9 : శింగనమల చెరువు మరవ వద్ద పెద్ద రంధ్రం ఏర్పడింది. చెరువులోనికి నీరు వస్తే అ మరవ మోరం తెగిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద రంధ్రం పూడ్చేలా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రెండేళ్ల క్రితం పుష్కలంగా వర్షాలు రావడంతో శింగనమల శ్రీరంగరాయల చెరువు పూర్తిగా నిండి తొమ్మిది నెలలు పాటు మరవ పారింది. ఆ సమయంలో నీటి వేగానికి మరవ వద్ద సుమారు మూడు మీటర్లు పైగా లోతైన రంధ్రం ఏర్పడింది. మళ్లీ భారీ వర్షాలు వచ్చి.. చెరువ నిండి మరవ పారుతే ఆ మరవ మోరం తెగిపోయే పరిస్థితి ఉందని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం చెరువు ప్రాంతం మీదుగా అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు రోజూ వెళ్తున్నా.. మరవ వద్ద ఏర్పడ్డ పెద్ద రంధ్రం గురించి మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మరవ మరమ్మతులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





చెరువు మరవ మోరంపై ఏర్పడ్డ పెద్ద రంధ్రం, మరవ కింద కోతకు గురైన ప్రాంతం



నారా భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నారా భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు మంగళవారం కలిశారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో నారా భువనేశ్వరిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

దాడులపై ఏనాడైనా స్పందించారా..?

జొన్నలగడ్డ పద్మావతిపై టీడీపీ బీసీ సెల్ మండిపాటు



మాట్లాడుతున్న ఆవుల క్రిష్ణయ్య

గార్లదిన్నె, జనవరి 9: నాలుగున్నర ఏళ్లల్లో దళితులపై జరిగిన దాడులు, అన్యాయాలపై ఏనాడైనా స్పందించారా అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల క్రిష్ణయ్య మండిపడ్డారు. మర్తాడులో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ సారి ఎమ్మెల్యే టికెట్ రాదన్న అక్కసుతో నీటి సమస్యను అడ్డుగా పెట్టుకొని.. వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులపై లైవ్‌లో విమర్శలు చేసి.. మరుసటి రోజు ఉదయమే మాటమార్చి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. అక్కసు తీరాక ఎల్లో మీడియా దుష్ప్రచారం చేశారంటూ మాటమార్చడం ద్వంద్వవైఖరికి నిదర్శనమని అన్నారు. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య, మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేసు, ఐటీడీపీ మండలాధ్యక్షుడు మధమంచి శ్రీధర్‌నాయుడు, హనీఫ్ పాల్గొన్నారు.

జయహో బీసీ రథం ప్రారంభం



రథాన్ని ప్రారంభిస్తున్న ముంటిమడుగు, ఆలం

గార్లదిన్నె, జనవరి 9 : టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య ఆధ్వర్యంలో జయహో బీసీ రథాన్ని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు అనంతపురంలో మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలను మాత్రమే జగన్‌రెడ్డి మార్చుతూ వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీపై నిత్యం దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ పార్టీ ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర, బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య, మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేసు పాల్గొన్నారు.

హిందూపురం ఎంపీ టికెట్‌ను వాల్మీకులకు కేటాయించాలి



మాట్లాడుతున్న టీడీపీ వాల్మీకి నాయకులు

చెన్నేకొత్తపల్లి, జనవరి 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ హిందూపురం పార్లమెంట్ టికెట్‌ను వాల్మీకి బోయలకు కేటాయించాలని ఆ పార్టీకి చెందిన పలువురు వాల్మీకులు కోరారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప మంగళవారం మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి హిందూపురం పార్లమెంట్ పరిధిలో మెజారిటీ వర్గీయులైన వాల్మీకులు పార్టీకి అండగా ఉంటున్నారన్నారు. అయితే పార్టీలో మొదటి నుంచి చట్టసభల్లో సరైన ప్రాధాన్యత కల్పించలేదన్నారు. ఈ సారైన బోయలకు తగిన రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి ఎంపీ టికెట్‌ను కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు నక్కా నాగరాజు, ప్యాదిండి నరసింహులు, గేటు నాగరాజు, మల్లికార్జున, ఆదెప్ప, ప్రభాకర్, హేమాద్రి, పోతన్న, పణీంద్ర, ముత్యాలు, మారుతి పాల్గొన్నారు.

దినసరి కూలీలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కేఎం జకీవుల్లా

అనంతపురం అర్బన్, జనవరి 9: స్థానిక రెండో డివిజన్‌లో పలువురు దినసరి కూలీలకు టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళీ, మోహన్‌కుమార్, రబీ రసూల్, పరమేష్, తిరుపాల్, షేక్షా, మాధవ్, జయరాం, పరమేష్, లక్ష్మీనాయుడమ్మ, ఉమాదేవి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి అవార్డు



నందితను సన్మానిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, జనవరి 9: సామాజిక అవగాహన, సేవా కార్యక్రమాల్లో విస్తృత సేవలు అందించి నందుకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్ నందితకు ఉత్తమ పుర స్కారం లభించింది. ఈ సంద ర్భంగా మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో నందితను వైస్‌ప్రిన్సిపాల్ శశాంకమౌళి సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విష్ణుప్రియ, సోమశేఖర్, రామకృష్ణ, అధ్యాపకులు భారతి, పల్లవి, మాధవి, రఘురాములు, శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనంతపురం రూరల్, జనవరి 9: మండలంలోని పాపంపేట పంచాయతీ బసవతారక నగర్‌లోని శ్రీనెట్టి కంటి ఆంజనేయస్వామి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. ఆలయంలోని శివుడు, వెంకటేశ్వర స్వామి, సీతారాములు, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. పండితులు శతరుద్ర యాగం, అన్నాభిషేకం నిర్వహించారు.

అన్నాభిషేకం అనంతరం స్వామి వారు →




రాయదుర్గంలో సీఎం జగన్ ఫొటో ముందు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


తాడిపత్రిలో చీరకొంగుతో బేడీలు వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గుమ్మఘట్టలో చెవిలో పువ్వు పెట్టుకుని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


కణేకల్లులో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు


కళ్యాణదుర్గంలో దుర్గాదేవికి పూజలు చేస్తూ భజనలు చేస్తున్న అంగన్‌వాడీలు


గుత్తిలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్‌ఐ


గుత్తి పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు

సమ్మెను ఆపం

జైల్లుకైనా వెళతాం.... కానీ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మెను ఆపమని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తూ వారు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 29రోజులుగా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఎస్మా చట్టం పేరుతో వేధించడం తగదన్నారు. గుత్తిలో సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్‌భరో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుంతకల్లులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


కుందుర్పిలో చెవులు, కళ్లు మూసుకుని నిరసన చేపట్టిన అంగన్‌వాడీలు


ఉరవకొండలో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


వజ్రకరూరులో పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీ కార్యకర్తలు


విడపనకల్లులో నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు


బెళుగుప్పలో నిరవధిక సమ్మెలో మాట్లాడుతున్న మండల అధ్యక్షురాలు సత్యవతి


యాడికిలో సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదాం: ఉన్నం


బెస్తరపల్లిలో కరపత్రాలు పంచుతున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కుందుర్పి, జనవరి 9: రైతుల గోడు పట్టించుకోని జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హనుమంతరాయచౌదరి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందించి అండగా నిలిచిందన్నారు. చీరలు, గాజులు పంచారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లికార్జున, మాజీ సర్పంచ్ రాఘవేంద్రబాబు, గోళ్ల వెంకటేశులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన గేట్స్ విద్యార్థులు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుత్తి, జనవరి 9: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 23 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్ రెడ్డి తెలిపారు. ప్రముఖ మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారన్నారు. ఇందులో 23 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజనీరులుగా ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్ర మంలో డైరెక్టర్ శ్రీవాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతి, సిబ్బంది ఇంతి యాజ్, తన్వీర్, తదితరులు పాల్గొన్నారు.

దానిమ్మ తోటల పరిశీలన


దానిమ్మ మొక్కలను పరిశీలిస్తున్నజిల్లా ఉద్యానశాఖాధికారి

కళ్యాణదుర్గం, జనవరి 9: దానిమ్మ తోటలను జిల్లా ఉద్యానశాఖాధికారి రఘునాథరెడ్డి పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కంబదూరు మండలంలోని కొత్తపల్లిలో ఎరుకుల తిమ్మప్ప అనే రైతు పొలంలో సాగు చేసిన దానిమ్మ పంటను మంగళవారం పరిశీలించారు. దానిమ్మ పంట దిగుబడి, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. దానిమ్మ పంట స్థాయిని బట్టి ఏ రకమైన ఎరువులు, మందులు వాడాలి తదితర అంశాలపై క్షుణంగా వివరించారు. రబీ సీజన్‌లో పంట పెట్టిన వివిధ రకాల పంటలను ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ క్రాప్‌లో పంట వివరాలను నమోదు చేసుకున్న రైతలకు మాత్రమే ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు నష్టపరిహారం లభించే అవకాశాలు ఉన్నాయని రైతులకు సూచించారు. ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహారావు, ఉద్యాన అధికారి గౌసియాబీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మోనా, హార్టికల్చర్ అసిస్టెంట్ స్నేహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాగవత పఠన, శ్రవణ యజ్ఞం

పుట్లూరు, జనవరి9: మండలంలోని తక్కళ్లపల్లిలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 13నుంచి 19వరకు భాగవత పఠన, శ్రవణ యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రతిరోజూ విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. 19న గోపూజ, నగర సంకీర్తన, గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్, జనవరి 9: అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి 120 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన ఆంజనేయులు కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి అమ్ముతుండగా గ్రామంలో అరెస్టు చేసి మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీ.హీరేహాళ్: కర్ణాటక మద్యాన్ని ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్న సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. మండలంలోని పులకుర్తి గ్రామ సమీపంలో ఎస్‌ఐ రంగడు యాదవ్ తన సిబ్బందితో సోదాలు నిర్వహిస్తుండగా జాజరకల్లు గ్రామం వైపు నుండి ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి కర్ణాటక మద్యంతో వచ్చాడు. ఆ వాహనాన్ని పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా వ్యక్తి ఆ ద్విచక్రవాహనాన్ని వదిలిపెట్టి పారిపోయాడు. పోలీసులు ఆ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని ఎనిమిది బాక్సులు 768 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి: జేసీ


నాయకులతో మాట్లాడుతున్న జేసీ దివాకర్‌రెడ్డి

యాడికి, జనవరి9: తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నగరూరు, భోగాలకట్ట గ్రామాల్లోని పలువురు టీడీపీ నాయకులను ఆయన కలిశారు. వచ్చే ఎన్నికల్లో అంతా సమష్టిగా పనిచేసి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. విద్య, ఉపాధి, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం చంద్రబాబుకే సాధ్యమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం అతలాకుతలమైన దశలో ఉందన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు సరిదిద్దడం చంద్రబాబుకే సాధ్యమని తెలిపారు. ఆయన వెంట చవ్వా గోపాల్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, నరసింహులు, కేశవచౌదరి, వెంకటనారాయణ, శ్రీరాములు, ఆదినారాయణ, రామచంద్రారెడ్డి, సత్య, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్లిం మైనార్టీ సదస్సుకు తరలిన నాయకులు


కాలవతో మైనార్టీ ఆత్మీయ సదస్సుకు హాజరైన బొమ్మనహాళ్ మైనార్టీ నాయకులు


మైనార్టీ సదస్సుకు తరలుతున్న కణేకల్లు ముస్లిం నాయకులు

బొమ్మనహాళ్, జనవరి 9: టీడీపీ ఆధ్వర్యంలో రాయదుర్గం లో మంగళవారం జరిగిన ముస్లిం మైనార్టీ ఆత్మీయ సదస్సుకు మండలం నుంచి టీడీపీ మైనార్టీ నాయకులు తరలివెళ్లారు. మండలంలోని దర్గాహొన్నూరు, ఉద్దేహాళ్, ఏళంజి తదితర గ్రామాల నుండి టీడీపీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్మాస్‌వలి, మహమ్మద్ రఫీ, మున్నా, చాంద్ బాషా, కమల్‌బాషా, సోడా సర్మాస్, కొలిమి అలీ, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: టీడీపీ ఆధ్వర్యంలో రాయదుర్గంలో మంగళవారం జరిగిన ముస్లిం మైనార్టీ ఆత్మీయ సదస్సుకు మండలం నుంచి టీడీపీ మైనార్టీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాబుసాబ్, షేక్‌ముజ్జు, చాంద్‌బాషా, ఎంసీ సర్మాస్, సలీమ్, ఖాలీద్, రజాక్,అబ్దుల్లా, జిలాన్, టీడీపీనాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, ప్రభాకర్, సూరి, హరి తదితరులు పాల్గొన్నారు.

చీమలవాగుపల్లిలో బాబు ష్యూరిటీ


మహిళతో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, జనవరి9: మండలంలోని చీమలవాగుపల్లి గ్రామంలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నివర్గాల వారిని ఆదుకుంటామన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల క్లస్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని యానిమేటర్ల ఆందోళన

పెద్దవడుగూరు, జనవరి9: మండలకేంద్రంలోని స్త్రీశక్తి భవనం వద్ద మంగళవారం వేతనాలు చెల్లించాలంటూ యానిమేటర్లు ఆందోళన నిర్వహించా రు. యానిమేటర్ల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో మహిళా సంఘాలకు సేవలు అందిస్తున్నామన్నారు. అరకొర వేతనాలు కూడా సక్రమంగా చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.

11మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్, జనవరి9: పట్టణంలోని పాతకోట సమీపంలో మంగళవారం 11మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.61260 స్వాధీనం చేసుకున్నామని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడిచేసి నిందుతులను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

యల్లనూరు, జనవరి9: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటశివారెడ్డి మంగళవారం హెచ్చరించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని దంతలపల్లిలో గ్రామసభను ఏర్పాటుచేశారు. రౌడీషీటర్లకు, ఫ్యాక్షనిస్టులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన వెంట ఎస్‌ఐ ధరణీబాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పుట్లూరు: మండలంలోని మడుగుపల్లిలో మంగళవారం రాత్రి డీఎస్పీ వెంకటశివారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యాక్షనిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

పప్పుదినుసుల సాగుపై దృష్టి పెట్టండి

పెద్దవడుగూరు, జనవరి9: వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పప్పుదినుసుల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి మల్లీశ్వరి తెలిపారు. మండలంలోని కిష్టిపాడు గ్రామంలో మంగళవారం కంది పంటపై క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో తక్కువ వర్షం పడటంతో అందుకు అనుగుణంగా కంది, పెసర, కొర్ర, జొన్న వంటి పంటలు సాగుచేసుకోవాలన్నారు. తక్కువపెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే దిశగా పంటలు పండించాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రజనీ, సిబ్బంది సునీత, రైతులు పాల్గొన్నారు.

కోమటికుంట్లలో నాకాబందీ

పుట్లూరు, జనవరి8: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో పుట్లూరు, యల్లనూరు ఎస్‌ఐలు దిలీప్‌కుమార్, ధరణీబాబు మంగళవారం నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని ఇరువర్గాలు, రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఇరువర్గాలు ఉండాలన్నారు. చిన్న సమస్యలను పెద్దగా చూపుతూ గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


గుంతకల్లులో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు


రాయదుర్గంలో వేపాకు కట్టుకొని నిరసన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

గుత్తి, జనవరి9: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మున్సిపల్ కార్మికులను సీఎం రోడ్డు పాలు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు, సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● గుంతకల్లులోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు మంగళవారం 8వ రోజు కొనసాగాయి. కార్మికులు గడ్డి తింటూ నిరసన తెలిపారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ తనిఖీ చేయాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ఉరవకొండ,జనవరి9: సాధారణ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజుల్లో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సెక్టోరియల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం సెక్టోరియల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు ఉన్నావో లేదో పరిశీలించాలన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, అంతకు మునుపు గ్రామాల్లో గొడవలు, పోలింగ్ రిగ్గింగ్, రీ పోలింగ్ ఏమైనాజరిగిందా, తదితర అంశాలపై నివేదికలు అందజేయాలన్నారు. రెండు రోజుల్లోపు ప్రతి ఒక్క పోలింగ్ స్టేషన్ పరిశీలించి, నిర్ణీత ఫార్మాట్లో నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఈఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, తహసీల్దార్లు శ్రీధర్ మూర్తి, ఓబులేసు, ఈరమ్మ, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర

బొమ్మనహాళ్, జనవరి 9: మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ విలేకరులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు మండల స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బుధవారం గోవిందవాడ పాఠశాలలో ఖోఖో, క్రికెట్, బొమ్మనహాళ్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు జరుగుతాయని చెప్పారు. 29, 30 తేదీలలో నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు జరుగుతాయన్నారు.

ఎనిమిది మంది బైండోవర్

యల్లనూరు, జనవరి9: మండలంలో మంగళవారం ఎనిమిదిమందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. వివిధ కేసుల్లో ఉన్న కొడవండ్లపల్లికి చెందిన నలుగురు, శింగవరం, కొత్తపల్లికి చెందిన ముగ్గురు, యల్లనూరుకు చెందిన ఒకరిని తహ సీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పాతపెన్షన్ పునరుద్ధరించాలని నిరాహార దీక్ష


నిరాహార దీక్షలు చేపట్టిన మజ్దూరు యూనియన్ నాయకులు

గుత్తి, జనవరి 9: గుత్తిఆర్‌ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వే మజ్దూరు యూనియన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఓపీఎస్ మన హక్కు ఓపీఎస్ సాధనే మన బాధ్యత అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఓపెన్‌లైన్ బ్రాంచ్ కార్యదర్శి శేఖర్‌బాబు, చైర్మన్ సుధీర్, డీజిల్ షెడ్ బ్రాంచ్ కార్యదర్శి రామాంజినేయులు రెడ్డి, కార్యదర్శి నరసింగరావు, మనోహర్, చైర్మన్ మనోహర్‌బాబు, జగదీష్, అశోక్‌కుమార్, దాదాఖలందర్, త్యాగరాజు, రంగనాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

యాడికి, జనవరి9: మండలంలోని రాయలచెరువు వద్ద కుల్సింబీ (65) ఉరి వేసుకొని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన ఖాశీంసాబ్ భార్య కుల్సింబీ ఆకుతోటల్లో ఆకులు కోయడానికి కూలి పనులకు వెళ్లేది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరూ వివాహితులే. జీవనానికి కుల్సింబీ తీవ్ర ఇబ్బందులు పడేది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన కుల్సింబీ మంగళవారం కూలిపనులకని రాయలచెరువు పొలిమేర వద్దకు వచ్చింది. సమీపంలోని ముళ్లపొదల లోపలి చీర కొంగుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అటువైపుగా వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. సంఘటన ప్రదేశానికి వెళ్లిన పోలీసులు వివరాలు ఆరాతీశారు. కిష్టిపాడు గ్రామానికి చెందిన కుల్సింబీగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఉరవకొండ,జనవరి9: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ సొమ్ము లెక్కింపును మంగళవారం చేపట్టారు. దేవదాయశాఖ అధికారిణి రాణి, ఆలయ ఈవో విజయ్ కుమార్ పర్యవేక్షణలో హుండీలు తెరిచి లెక్కింపు చేశారు. 106 రోజులకు గాను రూ. 22.71లక్షలు ఆదాయం వచ్చిందన్నారు.2.25 మిల్లీ గ్రాముల బంగారం, 20. 65 గ్రాముల వెండి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ సేవా సమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దారి విషయంలో ఘర్షణ

యల్లనూరు, జనవరి9: మండలంలోని తిరుమలా పురం గ్రామంలో పొలానికి వెళ్లే దారి విషయంలో మంగళవారం ఘర్షణ జరిగింది. వివరాలమేరకు రవీంద్రారెడ్డికి, రామానుజన్‌రెడ్డి మధ్య భూతగాదాలు ఉండేవి. రవీంద్రారెడ్డి రహదారి గుండా తోటలోకి వెళుతుండగా రామానుజన్‌రెడ్డి అడ్డుపడ్డాడు. ఈ రస్తా మీకు సంబంధించింది కాదని చెప్పడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.